సాక్షి
అనకాపల్లి
శనివారం । 24 । జూన్ । 2023





## నరసింహావతారంలో జగన్నాథుడు

అనకాపల్లి టౌన్: గుడ్డురోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామి శుక్రవారం నరసింహావతారంలో దర్శనమిచ్చారు.



## గిరి ప్రదక్షిణకు పటిష్ట బందోబస్తు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ బందోబస్తు ఏర్పాట్లను విశాఖ సీపీ త్రివిక్రమ్‌వర్మ శుక్రవారం సమీక్షించారు.

## స్వల్ప వర్షసూచన

అనకాపల్లి టౌన్: రాగల ఐదు రోజులు వర్షసూచన ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం పేర్కొన్నారు. ఈనెల 24న 15 మి.మీ, 25న 4 మి.మీ, 26, 27, 28 తేదీల్లో రెండేసి మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసే అవకాశం ఉందని చెప్పారు.

## న్యూస్‌రీల్

### హౌసింగ్ పీడీ సస్పెన్షన్

సాక్షి, అనకాపల్లి : అనకాపల్లి జిల్లా గృహనిర్మాణ శాఖ పీడీ కూర్మునాయుడుని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇటీవల పలు అవినీతి ఆరోపణల నేపథ్యంలో రెండు రోజుల క్రితమే ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఇదే శాఖలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో మరో ఇద్దరిపై కూడా వేటు పడనున్నట్లు సమాచారం. గతంలో గృహ నిర్మాణ శాఖలో అవుట్‌సోర్సింగ్ పేరిట ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్లు ఆరోపణలున్నాయి. వీటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకున్నారు. జిల్లా హౌసింగ్ శాఖలో ప్రక్షాళన దిశగా కలెక్టర్ కఠిన చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం.

### మంచాల మోడల్ స్కూల్‌కు గ్రీన్ స్కూల్ పురస్కారం



మంచాల మోడల్ స్కూల్

చీడికాడ : మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌కు 2023కు గాను గ్రీన్ మెంటార్స్ అంతర్జాతీయ ఎన్జీవో నిర్వహించే ప్రతిష్టాత్మక గ్రీన్ స్కూల్ అవార్డ్ వచ్చినట్టు స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక మీడియాకు వివరాలు వెల్లడించారు. న్యూయార్క్‌లో ఈ ఏడాది సెప్టెంబర్లో జరిగే 78వ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ పురస్కారాన్ని అందిస్తారన్నారు. స్థిరత్వం, పర్యావరణ సారథ్యాన్ని ప్రోత్సహించడంలో ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యాసంస్థలను ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్టు తెలిపారు. వీటిలో మంచాల మోడల్ స్కూల్ కూడా ఎంపికవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

### రెండో క్యాజువాల్టీకి రూ.30 లక్షలు మంజూరు

మహారాణిపేట (విశాఖ): కేజీహెచ్‌లో రెండో క్యాజువాల్టీ నిర్మాణానికి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున రూ.30 లక్షలు మంజూరు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కేజీహెచ్‌కు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రస్తుతం క్యాజువాల్టీలో పడకలు సరిపోవడం లేదు. ఈ మేరకు మరో క్యాజువాల్టీ కోసం తయారు చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఇందుకు అవసరమైన రూ.30 లక్షలు మంజూరు చేయడంతో త్వరలో టెండర్లు పిలుస్తామని శివానంద్ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థకు ఈ పనులు అప్పగిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న క్యాజువాల్టీకి పక్కనే 10 నుంచి 15 పడకలతో మరో క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామన్నారు. రూ.15 లక్షలు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ నుంచి, మరో రూ.15 లక్షలు సీఎస్సార్ నిధులు నుంచి ఖర్చు చేస్తామని వివరించారు.

### హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రాక రేపు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి ఆదివారం విశాఖ వస్తున్నారు. విజయవాడ నుంచి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ఉదయం విశాఖ చేరుకుంటారు. రైల్వే స్టేషన్ నుంచి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు వెళతారు. సాయంత్రం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడకు తిరుగుపయనమవుతారు.

# గడప గడపకు ప్రగతి ఫలాలు

> నెలన్నరలో 'అనకాపల్లి-అచ్యుతాపురం' రోడ్డు నిర్మాణం
>
> న్యాయపరమైన చిక్కుల కారణంగా 'అనకాపల్లి-అచ్యుతాపురం' రోడ్డు నిర్మాణం ఆలస్యమయింది. నెలన్నరలోపు పనులు పూర్తి చేస్తాం. రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన నిర్వాసితులకు తక్షణమే పరిహారం అందించే విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తాం.
>
> –టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

- విజయవంతంగా పూర్తి చేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజు
- ఇతర నియోజకవర్గాలకు 'యలమంచిలి' ఆదర్శం కావాలి
- అచ్యుతాపురం సెజ్‌లో 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు వచ్చేలా చర్యలు
- 'గడప గడపకు మన ప్రభుత్వం' విజయోత్సవ సభలో వై.వి.సుబ్బారెడ్డి
- టీడీపీకే భవిష్యత్తు లేదు.. ప్రజలకు మీరేమి గ్యారెంటీ ఇస్తారు?
- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్



జ్యోతిరావ్ పూలే విగ్రహాన్ని ఆవిష్కరించిన టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే కన్నబాబురాజు, మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తదితరులు





విజయోత్సవ సభలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే కన్నబాబురాజు.. సభకు హాజరైన జనసందోహం

సాక్షి, అనకాపల్లి: ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఎంతో దోహదపడిందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీ నాలుగేళ్ల పాలనలో నెరవేర్చడమే కాకుండా ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన లబ్ధిపై ప్రభుత్వం తరుపున ఎమ్మెల్యే, సమన్వయకర్త, అధికారులు మాట్లాడి, సమస్యలుంటే పరిష్కరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. శుక్రవారం అచ్యుతాపురంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ అధ్యక్షతన 'గడప గడపకు మన ప్రభుత్వం' విజయోత్సవ సభ జరిగింది. ముందుగా యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి సుబ్బారెడ్డి మహాత్మాగాంధీ, జ్యోతిరావ్ పూలే, గౌతమ బుద్ధుడు విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం సభాప్రాంగణం వేదిక మీద మహానేత వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి విశాఖ జిల్లాలో 'గడప గడపకు మన ప్రభుత్వం' విజయవంతంగా పూర్తి చేసిన ఎమ్మెల్యే కన్నబాబురాజుకు, నియోజకవర్గంలో గల వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు, ఉద్యోగులు, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.2 లక్షల 16 వేల కోట్లతో.. కోటీ 10 లక్షల మందికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ప్రజలను మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. 2014లో దొంగ హామీలు ఇచ్చి అధికారం చేజిక్కించుకొని ప్రజలను మోసం చేశాడని... మళ్లీ అదే విధంగా దొంగ హామీలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. మహానేత వైఎస్సార్ తీసుకొచ్చిన అచ్యుతాపురం సెజ్ కారణంగానే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగావకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇస్తున్నామన్నారు.

**కన్నబాబురాజు క్రమశిక్షణకు మారుపేరు**

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ... యలమంచిలిలోని అన్ని సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి చేయడానికి ఎమ్మెల్యే కన్నబాబురాజు సమయపాలన, అంకితభావం కారణమని చెప్పుకోవచ్చునన్నారు. కన్నబాబురాజు కార్యక్రమాన్ని పూర్తి చేశారని.. వారికి పూర్తిస్థాయిలో నిధులు మంజూరయ్యాయని.. తాను ముఖ్యమంత్రితో చెబితే రెండో విడత చేపడితే మళ్లీ సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున ఇస్తానని చెప్పారన్నారు. పూడిమడక వద్ద ఎన్టీపీసీ ఏర్పాటు చేసేందుకు గ్లోబల్ సమ్మిట్‌లో ఒప్పందం జరిగిందని, ఇది కార్యరూపం దాలిస్తే స్థానిక యువతకు వేలాది ఉద్యోగాలు వస్తాయన్నారు.

రెండు రోజుల నుంచి జిల్లాలో 'టీడీపీకి భవిష్యత్తు గ్యారెంటీ' యాత్ర చేపడుతున్నారని, ఆ పార్టీకే భవిష్యత్తు లేదే.. వారు ఏ విధంగా ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఇస్తారని ప్రశ్నించారు. ఏపీలో భూముల ధరలు రోజురోజుకూ క్షీణిస్తున్నాయని చంద్రబాబు ఒక సమావేశంలో చెప్పినట్టు కేసీఆర్ పేర్కొన్నారని, తెలంగాణ సీఎం ఏపీకి వచ్చి చూస్తే వాస్తవం తెలుస్తుందన్నారు. తెలంగాణలో ఒక ఎకరం అమ్మితే ఏపీలో 50 ఎకరాలు కొనుగోలు చేయవచ్చని కేసీఆర్ అంటున్నారే.... ప్రధాన పట్టణాలు కాదు ఒక గ్రామీణ ప్రాంతమైన అచ్యుతాపురంలో ఒక ఎకరం భూమి అమ్మితే తెలంగాణలో 150 ఎకరాలు కొనుగోలు చేయొచ్చని.. ఇదే విషయాన్ని చంద్రబాబు కేసీఆర్‌కి చెప్పాలని మంత్రి సూచించారు. ప్రభుత్వ విప్, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ... ఏపీలో ఇటీవల వారాహి యాత్ర పేరిట ఒక పిచ్చోడు బయలుదేరి కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నాడని, చంద్రబాబు లాభపడాలని చూస్తున్నాడన్నారు.

**అభివృద్ధి వైఎస్సార్ పుణ్యమే**

యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ... పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ఈ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా 'అచ్యుతాపురం - అనకాపల్లి రోడ్డు' ఒక్కటే ఆగిందని, అది మినహా అన్ని రోడ్లు పూర్తయ్యాయన్నారు. మహానేత వైఎస్సార్ కృషి మూలంగానే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, భూముల రేట్లు పెరిగాయన్నారు. ఇక్కడ ఉన్న ప్రతి ఇంట్లో యువతకు ఉద్యోగాలు వచ్చాయని, ఆర్థికంగా అందరూ లాభపడ్డారన్నారు. అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని, జిల్లాలో రూ.500 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్నారన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ మాట్లాడుతూ.. 181 రోజులు అన్ని సచివాలయాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తి చేశామని.. సహకరించిన ప్రతీ ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు రొంగలి జగన్నాథం మాట్లాడుతూ... సీఎం జగన్ ఈ నాలుగేళ్లు సువర్ణపాలన అందించారని, 2024లో మళ్లీ గెలిపిస్తే మరో 30 ఏళ్ల వరకూ ఇదే ఆదర్శపాలనే సాగుతుందన్నారు. గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ....రైతు బాంధవుడిగా ఆర్బీకేలు ఏర్పాటు చేసి వైఎస్ జగన్ అన్నదాతకు అండగా నిలిచారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వ కాలంలో నాయకులు వెళితే ప్రజలు ఛీ కొట్టేవారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అవినీతికి తావు లేకుండా అందజేయడంతో తమకు ప్రజలు స్వాగతం పలికారన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, అన్నంరెడ్డి అదీప్‌రాజు మాట్లాడుతూ... యలమంచిలి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీసుకుని తమ నియోజకవర్గంలో కూడా త్వరితగతిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు, కె.విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, జెడ్పీటీసీ లాలం రాము, నర్మాల కుమార్, దూలి నాగరాజు, సేనపతి సంధ్యారాణి, పెంటకోట సోమసత్యనారాయణ, ఎంపీపీలు కోనా సంధ్యలచ్చన్నాయుడు, గొట్టిముక్కల శిరీష శ్రీనిబాబు, బోదెపు గోవింద్, మళ్ల జయలక్ష్మి, పార్టీ అచ్యుతాపురం మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమంలో మరో ముందడుగు

- జగనన్న సురక్ష కింద అర్హులను గుర్తించి పథకాల అమలు
- జూలై 1 నుంచి ఆగస్టు 1 వరకు పెద్ద ఎత్తున కార్యక్రమం



జగనన్న సురక్ష ప్రారంభోత్సవ వర్చువల్ కార్యక్రమంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ ఎం.జాహ్నవి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి

తుమ్మపాల : ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని ఇప్పటి వరకు పొందని అర్హులను గుర్తించి, వారికి కూడా పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టడం సంక్షేమంలో మరో ముందడుగని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. తాడేపల్లిలో శుక్రవారం జరిగిన జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ భీశెట్టి వరాహసత్యవతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 24 నుంచి 30 వరకు వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కింద వివరాలు సేకరిస్తారని తెలిపారు. అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందజేయనున్నట్టు పేర్కొన్నారు. సచివాలయం, వలంటీర వ్యవస్థ ద్వారా ఇంటింటికి సేవలు అందుతున్నాయన్నారు. స్పందన కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి అడుగులు వేసి, జవాబుదారీతనం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే 99 శాతం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మిగిలిన ఒక శాతం అర్హులకు కూడా పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతో జగనన్న సురక్ష పథకానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. ద్వైవార్షిక విధానంలో మిగిలిపోయిన అర్హులను జూలై, డిసెంబర్ నెలల్లో గుర్తించి ప్రయోజనం అందిస్తుస్తున్నట్టు పేర్కొన్నారు. జగనన్న సురక్ష కింద సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లకు మండల పరిధిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఉచితంగా అందించే 11 రకాల సేవలు, ఇంటింటి సర్వేలో వివరాల సేకరణ ఫార్మాట్‌ను అందజేశామన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కింద వచ్చిన అర్జీలను సంఘటితం చేసి పరిష్కారం కాని వాటిని జగనన్న సురక్ష కింద పరిష్కరిస్తామన్నారు. జూలై 1 నుంచి ఆగస్టు 1వరకు జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం కార్యచరణకు పూర్తి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇంటింటి సర్వేలో అర్జీలకు జగనన్న సురక్ష ద్వారా ధ్రువపత్రాలు అందిస్తామన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాట్లు, నిర్వాహణలో తీసుకోవల్సిన జాగ్రత్తలపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి డివిజన్ స్థాయిలో పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటరమణ, ఆర్డీవో చిన్నికృష్ణ, జీవీఎంసీ జోనల్ కమీషనర్ వెంకటరమణ, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి పి.మంజులవాణి, శంకరం గ్రామ సర్పంచ్ పి.లక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

**నేటి నుంచి సర్వే**

తుమ్మపాల : జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఈ నెల 24 నుంచి వలంటీర్లు వారికి కేటాయించిన క్లస్టరులో ఇంటింటికీ తిరిగి సర్వే చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికీ పథకాలు అందని అర్హుల వివరాలు సేకరించాలన్నారు. జూలై 1 నుంచి అన్ని మండలాల్లో రెండు టీమ్‌లు పర్యటించనున్నట్లు తెలిపారు. టీమ్‌ల పర్యటన వివరాలు అనకాపల్లి వెబ్‌సైట్ నందు లభిస్తుందన్నారు.

# నేటి తరానికి వెంకయ్యనాయుడు ఆదర్శం



ఐఏఎస్ అధికారులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు దంపతులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

కొమ్మాది: క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధతతో ఉప రాష్ట్రపతిగా ఎదిగిన వెంకయ్యనాయుడును నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు 50 ఏళ్ల ప్రజాజీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవానుబంధం, సహచర బృందం' పేరిట రుషికొండలో ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంలో ఎలా మెలగాలి, ఎలా ఎదగాలి అనేది వెంకయ్యనాయుడును చూసి నేర్చుకోవాలన్నారు. నేడు తాను ఈ స్థాయిలో ఉండడానికి వెంకయ్యనాయుడే కారణమని అన్నారు. చిన్నప్పటి నుంచి వెంకయ్యనాయుడు దంపతులు నన్ను ఒక బిడ్డలా చూసుకున్నారని, ఈ సమయంలో తన తల్లి గురించి చెబుతూ కిషన్‌రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు.

**నీతి నిజాయతీతో ఉన్నత శిఖరాలకు..**

ఏ పనిలోనైనా నీతి, నిజాయతీ ఉంటే ఎంతటి శిఖరాన్నైనా చేరుకోగలమని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా పద్ధతిగా, నీతివంతంగా ఎదగాలన్నారు. రాజకీయ ప్రస్థానంలో తన ఎదుగుదలకు సహకరించిన ప్రతి ఒక్కరికీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తనతో పని చేసిన ఐఏఎస్ అధికారులు, వ్యక్తిగత సిబ్బందిని వెంకయ్యనాయుడు సన్మానించారు.

# హత్య కేసు నిందితుల పట్టివేత

- కేసు వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ మురళీకృష్ణ



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్ : అనకాపల్లి మండలం ఊడేరు గ్రామంలో రాజాన కన్నబాబును హత్య చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివరాలు.. మృతుడు రాజాన కన్నబాబు(43) అనకాపల్లి గాంధీనగరంలో 2019 నుంచి తల్లి రామయ్యమ్మ, తమ్ముడు శివరామకృష్ణతో నివసిస్తున్నాడు. విశాఖలో హత్యాయత్నం, కిడ్నాప్, దోపిడి నేరాల్లో ముద్దాయిగా ఉన్నాడు. అనకాపల్లిలో మృతునికి ముగ్గురు వ్యక్తులు పరిచయమయ్యారు. వారి మధ్య స్నేహం పెరిగింది. ఈ క్రమంలో చోడవరంలో దండి శ్రావణి అనే మహిళ భూమి సెటిల్‌మెంట్ వ్యవహారంలో మృతుడు తలదూర్చాడు. 21న ఉదయం మృతుడు విజయరామరాజుపేటకు చెందిన చిన్ని లక్ష్మణరావు(లచ్చ), గైరమ్మ రహదారికి చెందిన లోపింటి సురేంద్ర, గాంధీనగరం ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ రహదారికి చెందిన పందిరి దుర్గారావులతో కలిసి రెండు మోటారు సైకిళ్లపై చోడవరం వెళ్లాడు. శ్రావణితో భూ వ్యవహారానికి సంబంధించిన వ్యవహారాలు మాట్లాడారు. అనకాపల్లి వచ్చేక్రమంలో వెంకన్నపాలెం కూడలి వద్ద నాలుగు మద్యం బాటిళ్లు తీసుకుని అనకాపల్లికి వచ్చే మార్గంలో ఊడేరు కూడలి వద్ద ఖాళీ స్థలంలోకి వెళ్లి పూటుగా సేవించారు. ఈ క్రమంలో రాజాన కన్నబాబు, చిన్ని లక్ష్మణరావుకు మధ్య రూ.లక్ష గురించి ఘర్షణ తలెత్తింది. చిన్ని లక్ష్మణరావు యూకలిప్టస్ కర్రతో కన్నబాబును తల, శరీర భాగాలపై కొట్టాడు. పందిరి దుర్గారావు కత్తితో కన్నబాబు తలపై గట్టిగా పొడిచి అక్కడి నుంచి ముగ్గురూ పరారైనట్లు ఎస్పీ వెల్లడించారు. మృతుని తమ్ముడు రాజాన శివరామకృష్ణ ఫిర్యాదు మేరకు గురువారం స్థానిక రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితులు ముగ్గుర్ని విజయరామరాజుపేట వద్ద అదుపులోకి తీసుకుని, శుక్రవారం కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు. ముద్దాయిల నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, ఒక కర్ర, కత్తిని స్వాధీన పరచుకున్నట్లు పేర్కొన్నారు. ఎఎస్పీ(క్రైం) పి.సత్యనారాయణరావు, డీఎస్పీ సుబ్బరాజు, రూరల్ సీఐ ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

# రైతు బాంధవుడు వీవీఆర్

- వీవీ రమణ శత జయంతి సభ రేపు
- హాజరుకానున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



వీవీ రమణ

తుమ్మపాల: రైతు బాంధవుడు, రాజ్యసభ సభ్యుడు స్వర్గీయ వీవీ రమణ(వీవీఆర్) శతజయంతి వేడుకలకు అనకాపల్లి పట్టణం ముస్తాబయింది. ఉత్తరాంధ్ర రైతు పోరాటాలు, రాజకీయ చరిత్రలో వీవీ రమణ పేరు సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. వ్యవసాయ కూలీల, రైతు సమస్యలపై ఆయన చేసిన పోరాటాలు రాష్ట్రాన్ని దాటి, దేశవ్యాప్తంగా ప్రజల మన్ననలందుకున్నాయి. రాజ్యసభ సభ్యునిగా రైతుల సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. అదే ఆయన్ని ఇప్పటికీ ఉత్తరాంధ్ర రైతుల గుండెల్లో నిలిచేలా చేసింది.

**రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా..**

అప్పట్లో రాజ్యసభ సభ్యుడిగా ఎన్నిక కావడం అత్యంత కష్టతరమైన విషయం. అలాంటిది ఆయన ఆచార్య ఎన్జీ రంగా స్థాపించిన కృషికార్ లోక్ పార్టీ(కేఎల్‌పీ) నుంచి రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. రాజ్యసభలో అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎదుర్కోవడంలో వీవీ రమణ ముందుండేవారు. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణ వంటి వారితో పనిచేసిన అనుభవం ఆయనది. ఒకసారి లోక్‌సభకు పోటీ చేసి ఓడిన ఆయనకు అప్పటి అధికార కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర మంత్రి పదవి ఇస్తామని, పార్టీలోకి ఆహ్వానించినా సున్నితంగా తిరస్కరించిన గొప్ప వ్యక్తి వీవీఆర్.

**రైతు సమస్యలపై నిరంతర పోరాటం**

వీవీఆర్ ఎక్కువగా రైతు సమస్యలనే రాజ్యసభలో చర్చించేవారు. వాటి పరిష్కారానికి కృషి చేసేవారు. ఎన్జీ రంగా, గౌతు లచ్చన్నలకు శిష్యునిగా వీవీఆర్ తనను తాను చెప్పుకునేవారు. వాణిజ్య పంట(చెరకు) అధికంగా పండించే అనకాపల్లి ప్రాంతంలో పంచదార పరిశ్రమ ఏర్పాటుచేసి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కృషి చేశారు. చక్కెర పరిశ్రమ ఏర్పాటుపై విదేశాలకు వెళ్లి అధ్యయనం చేశారు. కేవలం 15 రోజుల్లో రైతుల భాగస్వామ్యంతో తుమ్మపాల వీవీ రమణ చక్కెర కర్మాగారానికి శ్రీకారం చుట్టి, సహకార స్ఫూర్తికి నిదర్శనంగా నిలిపారు. 56 ఏళ్లకే మరణించిన ఆయన జన్మించి ఈ ఏడాదికి వందేళ్లు. అందుకే ఆయన శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



వీవీ రమణ శతజయంతి వేడుక కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, వీవీ రమణ కుమారులు రంగాజీ, లక్ష్మణరావు

### ఘనంగా శతజయంతి ఉత్సవాలు

రైతు బాంధవుడు వీవీ రమణ శతజయంతి ఉత్సవాలను ఈ నెల 25న పట్టణంలోని పెంటకోట కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా నిర్వహించనున్నట్టు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు తెలిపారు. గవరపాలెం రైతు భారతిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్జీరంగా, నెహ్రూ, లాల్‌బహదూర్ శాస్త్రి, సర్వేపల్లి రాధాకృష్ణలాంటి మహోన్నత వ్యక్తుల అభిమానాన్ని చూరగొన్న వీవీ రమణ నేటి యువతకు ఆదర్శమని కొనియాడారు. ఈ సందర్భంగా శతజయంతి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, గౌరవ అతిథులుగా పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి వేగి సూరిఅప్పారావు, మాజీ మంత్రులు వడ్డే శోభనాద్రీశ్వరరావు, గౌతు శ్యామ్‌సుందర్‌శివాజీ విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వీవీ రమణ కుమారులు రంగాజీ, లక్ష్మణరావు, స్థానిక నాయకుడు కొణతాల సత్యనారాయణ పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ఆగస్టు 6న ఆర్యవైశ్య ఉచిత వధూవరుల పరిచయ వేదిక



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సభ్యులు

**అనకాపల్లి టౌన్:** విశాఖ ఉమ్మడి జిల్లా 41వ ఆర్యవైశ్య ఉచిత వధూవరుల పరిచయ వేదిక ఆగస్టు 6న విశాఖ దాబాగార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య యువజ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు నల్లూరి నూకరాజు తెలిపారు. స్థానిక పాత బస్‌స్టాండ్ ఉప్పల చంద్రశేఖరరావు కల్యాణ మండపంలో శుక్రవారం ఆయన పరిచయవేదిక కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా, ఆర్యవైశ్యులు అందించిన విరాళాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అవివాహిత ఆర్యవైశ్యులు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 7780149250 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యువజన సంఘం కార్యదర్శి పూసర్ల సురేష్‌కుమార్, పరిచయ వేదిక కోశాధికారి యలమర్తి గణేష్, సభ్యులు పాలూరి వరప్రసాద్, కంకటాల సతీష్, బిళ్లపాటి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

### అప్పన్నకు విశేషంగా గరుడసేవ

**సింహాచలం:** వరాహ లక్ష్మీన్నృసింహ స్వామికి శుక్రవారం జరిగిన గరుడ సేవలో ఒడిశా భక్తులు తరించారు. మూడు నెలల పాటు అప్పన్నకు సేవలందించేందుకు సింహగిరికి వచ్చిన లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి ఈ గరుడసేవను జరిపించారు. ఒడిశాలోని భువనేశ్వర్, పట్టుపురం, బరంపురం, పూరి, రాయగడ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ సేవలో పాల్గొన్నారు. సాయంత్రం వరాహ లక్ష్మీన్నృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి విశేష పూలాలంకరణ చేసి వెండి గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. మంగళ వాయిద్యాలు, భక్తుల జేజేల మధ్య మాడ వీధుల్లో స్వామిని ఊరేగించారు. వింజామరతో లక్ష్మీకాంత్ నాయక్ దాస్ స్వామికి సేవలందించగా..తమ సంప్రదాయం ప్రకారం ఒడిశా భక్తులు స్వామిని కీర్తించారు.

# ప్రజల వద్దకే పాలన తెచ్చిన సీఎం జగన్

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- చోడవరం మండలంలో రూ.2 కోట్లతో నిర్మించిన పలు నూతన భవనాలు ప్రారంభం



మైచర్లపాలెంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

**చోడవరం:** సుపరిపాలనను ప్రజల వద్దకే తెచ్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 2 కోట్లతో నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లు, పంచాయతీ భవనాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. చోడవరం పట్టణం ఇందిర కాలనీలో కమ్యూనిటీ హాలు భవనం, లక్కవరంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలు, గవరవరం, మైచర్లపాలెంలో పంచాయతీ కార్యాలయ భవనం, ఖండిపల్లి, గవరవరం గ్రామాల్లో గ్రామ సచివాలయ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ గ్రామాల్లో ఇన్ని పక్కా ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించలేదన్నారు. పరిపాలనను గ్రామాలకే తెచ్చి ప్రజలకు అందుబాటులో ఉంచిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీయే అన్నారు. ఎవరికీ ఏ పథకం కావాలన్నా వెంటనే వలంటీర్ల వ్యవస్థ ద్వారా నేరుగా అర్హులైన వారికే అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలోనూ లక్షలాది రూపాయలతో ఆయా వ్యవస్థలకు పక్కా భవనాలు నిర్మించడం జరిగిందన్నారు. పారదర్శకంగా పూర్తిస్థాయిలో ప్రజలకు అన్ని విధాలుగా సేవ చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలంతా మరోసారి దీవించి మద్దతు పలకాలని కోరారు. ఎంపీపీ గాడి కాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు శానాపతి రాజశేఖర్, శీరంరెడ్డి వెంకటరమణ, బండి నూకాలమ్మశ్రీను, చప్పగడ్డ అర్జునరావు, బూరే మాణిక్యం, బలిరెడ్డి నాగేశ్వరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, పార్టీ మండల ప్రతినిధులు పతివాడ అప్పారావు, చప్పగడ్డ శ్రీనువాసరావు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

- వి.వి.అగ్రహారంలో రోడ్డు నిర్మాణానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శంకుస్థాపన

**మాడుగుల రూరల్:** మారుమూల గ్రామాల్లో రహదారుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని వి.వి.అగ్రహారం పెట్రోల్ బంకు నుంచి బంగారుమెట్ట పోవు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో మైదాన, గిరిజన గ్రామాలను అనుసంధానం చేస్తూ పలు రోడ్ల నిర్మాణానికి కోట్లాది రూపాయల వ్యయం చేశామన్నారు. బుచ్చెయ్యపేట, మాడుగుల మండలాలను కలుపుతున్న బంగారుమెట్ట నుంచి వి.వి.అగ్రహారం బంకు వరకు రోడ్డు నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, వి.వి. అగ్రహారం పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

# మలేరియా, డెంగ్యూ ప్రబలకుండా చర్యలు

- తెనుగుపూడి విద్యాలయంలో డీఎంవో వరహాలుదొర పరిశీలన



తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంవో వరహాలుదొర

**దేవరాపల్లి:** గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) వరహాలుదొర వైద్య సిబ్బందికి సూచించారు. దేవరాపల్లి గ్రామ సచివాలయం-1లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీధుల్లో పర్యటించి నిల్వ నీటిలో లార్వాను పరిశీలించారు. అనంతరం తెనుగుపూడి డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో దోమల మందు పిచికారీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం డీఎంవో మాట్లాడుతూ గ్రామాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు, గుంతలు లేకుండా జాగ్రత్తపడేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమల బెడద అధికంగా ఉంటుందని, వాటి కాటుకు గురికాకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడేలా క్షేత్రస్థాయిలో వివరించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా జ్వరం కేసులు నమోదైతే సదరు జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేయించాలన్నారు. మలేరియా, డెంగ్యూ నిర్ధారణైతే వెంటనే వారికి మెరుగైన వైద్య సేవలందించేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలిత మాట్లాడుతూ ఇంటి ఆవరణలో నిమ్మ గడ్డి, తులసి, పుదీనా మొక్కలను పెంచుకోవడం ద్వారా దోమలు దరి చేరకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో పి. ప్రసాదరావు, హెల్త్ సూపర్‌వైజర్ మహేష్, పుష్పరాజ్, దేవరాపల్లి ఏఎన్‌ఎంలు జయసుధ, హైమా, ఎంఎల్‌హెచ్‌పీ మీనాకుమారి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# వైఎస్సార్ పశు బీమాతో ధీమా



మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి ప్రసాదరావు

**చీడికాడ/నర్సీపట్నం:** వైఎస్సార్ పశు బీమాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి బి.ప్రసాదరావు అన్నారు. శుక్రవారం చీడికాడ, నర్సీపట్నం, గొలుగొండ పశు వైద్యశాలల వద్ద వేర్వేరుగా పాడి రైతులకు గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల కాలానికి రూ.30 వేల బీమాకు గాను రైతు మాత్రం రూ. 384 చెల్లించాల్సి ఉంటుందన్నారు. గొర్రె, మేకకు బీమా చేసిన మొత్తం రూ.6 వేలు కాగా రైతు మాత్రం ఏడాదికి రూ. 36 చెల్లించాలన్నారు. ఈ బీమా పథకంలో అధికశాతం ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. నర్సీపట్నం, మాడుగుల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ డబ్ల్యూ. రాంబాబు, వి. చిట్టినాయుడు, జిల్లా నోడల్ అధికారి భానుబాబు, పశువైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# చిరుధాన్యాలకు మద్దతు ధర కల్పించాలి



చైర్మన్ విజయపాల్ శర్మకు వినతిపత్రం అందిస్తున్న కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం, జోనల్ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు

**తుమ్మపాల:** చిరుధాన్యాలకు మద్దతు ధర నిర్ణయించేలా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని వ్యవసాయ ధరల నిర్ణాయక కమిటీ జాతీయ చైర్మన్ విజయపాల్ శర్మకు కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు గొంతిన భక్తసాయిరాం, జోనల్ ఇన్‌చార్జి పాకలపాటి రవిరాజు వినతిపత్రం అందించారు. శుక్రవారం విశాఖలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ అధికారుల సమావేశంలో ఆయన్ను కలిసినట్లు భక్తసాయిరాం తెలిపారు. కేంద్రప్రభుత్వం చిరుధాన్యాల ప్రోత్సాహానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం, ఐక్యరాజ్యసమితి కూడా 2023ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా వీటికి కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారని వాపోయారు. వీరి నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యాపారులు ఎక్కువ ధరకు విక్రయించుకుని లాభాలు పొందుతున్నారన్నారు. దేశంలో ఇప్పటివరకు 24 రకాల పంటలకు మాత్రమే కనీస మద్దతు ధర నిర్ణయించారన్నారు. రైతులు ఒకే రకమైన పంటలు వేయకుండా పంటల మార్పిడిపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి ప్రణాళికలపై నిర్వహించే సమావేశాల్లో రైతులు, రైతు సంఘాలు, ట్రేడర్స్‌ను భాగస్వామ్యం చేయాలని కోరారు.

# ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులే కీలకం



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

**తుమ్మపాల:** సమాజ ఆర్థిక పరిపుష్టికి బ్యాంకులే కీలకమని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. నాల్గవ త్రైమాసికంలో బ్యాంకులు సాధించిన లక్ష్యాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కౌలురైతులు, స్వయం సహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు తగిన రుణాలు అందించి బ్యాంకర్లు జిల్లా ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. జిల్లా వేగంగా అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ శాఖలు, బ్యాంకుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఇకపై సమావేశాలకు పూర్తి సమాచారంతో అధికారులు హాజరుకావాలని ఆదేశించారు. విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. వెనకబడిన ప్రాంతాలను గుర్తించి అభివృద్ధికి నిపుణులతో అధ్యయనం చేయించాలని తెలిపారు. జగనన్న తోడు, స్త్రీనిధి, టిడ్కో, పీఎంఇజీపీ, పీఎంఎంఎస్‌వై, పీఎంఎఫ్‌ఎంఈ తదితర రుణాలపై సమీక్ష జరిపి వేగంగా గ్రౌండింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రిజర్వు బ్యాంకు జిల్లా ప్రతినిధి పూర్ణిమ, నాబార్డ్ జిల్లా అధికారి శ్రీనివాసులు, డీడీఎం (నాబార్డ్) జీఆర్.సామంత్‌కుమార్, లీడ్‌బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామకాలు

- పోలీసు ఉన్నతాధికారుల మానవత్వం



మహిళకు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ, చిత్రంలో ఏఎస్పీ భాస్కర్

**అనకాపల్లి టౌన్:** జిల్లాలో విధి నిర్వహణలో ఒకరు అనారోగ్యంతో మరొకరు మృతి చెందిన నేపథ్యంలో హోంగార్డుల కుటుంబాలకు కారుణ్య నియామకం కింద ఉద్యోగాలిచ్చి పోలీస్ ఉన్నతాధికారులు మానవత్వాన్ని చాటుకున్నారు. శుక్రవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో ఇటీవల కాలంలో మృతి చెందిన హోంగార్డులు (హెచ్‌జీ 628) చక్రాంతి రవికుమార్ కుమార్తె రోహిణికి, (హెచ్‌జీ 178) వంతుల భీషు భార్య లక్ష్మికి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ నియామకపత్రాలు అందజేశారు. పోలీసు ఉద్యోగంలో విలువలు, నేటి సమాజంలో నడుచుకోవాల్సిన తీరును ఈ సందర్భంగా ఆయన వారికి వివరించారు. కార్యక్రమంలో అదనపు (పరిపాలన) ఎస్పీ బి.విజయభాస్కర్, డీఎస్పీలు పి.నాగేశ్వరరావు, మళ్ల మహేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సతీష్, వెంకటరావు పాల్గొన్నారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే చర్యలు

- దుకాణాల్లో అధికారుల తనిఖీలు



దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

**చోడవరం:** బాలలను పనిలో పెట్టుకుంటే చట్టరీత్యా నేరమని, 14 ఏళ్ల లోపు వారిని పనిలో పెట్టుకుంటే చర్యలు తప్పవని సహాయక కార్మిక శాఖ అధికారి పి.సూర్యనారాయణ హెచ్చరించారు. చోడవరంలోని పలు దుకాణాలు,షాపుల్లో కార్మికశాఖ అధికారులు, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ఈ తనిఖీలు నిర్వహించినట్టు చెప్పారు. ప్రమాదకర వృత్తుల్లో 18ఏళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న వారిని నియమించరాదన్నారు. ఈ బృందంలో చోడవరం ఎస్‌ఐ అప్పలనాయుడు, ఐసీడీఎస్ సీడీపీవో ఉషారాణి, సూపర్ వైజర్ అనిత, ఏఎస్‌ఐ ఎ.వి.రమణ, ఐసీపీఎస్ డీసీపీ ఇన్‌ఛార్జి డి.లోవరాజు, గణపతమ్మ, కల్పన పాల్గొన్నారు.

# టీడీపీ బస్సు యాత్రలో విభేదాలు బహిర్గతం

- పార్టీ పెద్దల సమక్షంలో గొడవకు దిగిన తమ్ముళ్లు
- పార్టీ మండలాధ్యక్షుని ఫొటో ఫ్లెక్సీలో లేదంటూ ఆందోళన



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేశ్వరరావు



పార్టీ పెద్దల సమక్షంలో గొడవ పడుతున్న తమ్ముళ్లు

**మునగపాక:** టీడీపీ బస్సు యాత్రలో భాగంగా మునగపాకలో గ్రూపుల గోల ఒక్కసారిగా బయటపడింది. కొంతకాలంగా మండల పార్టీలో విభేదాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో పార్టీ పెద్దల సాక్షిగా మరోసారి ఇవి బహిర్గతమయ్యాయి. మునగపాక రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో శుక్రవారం రాత్రి గ్రామసభతోపాటు పల్లెనిద్ర చేయాలని నిర్ణయించారు. అనుకున్న సమయానికి పార్టీ పెద్దలు రావడం ఆలస్యం కావడంతో ఉన్న కొద్దిమందితోనే సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో టీడీపీ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు ఫొటో లేకపోవడంతో ఆయన అనుచరులు సమావేశ మందిరం వద్ద ఆందోళన చేశారు. ప్రోటోకాల్ పాటించకుండా అవమానించడం తగదంటూ కొంతసేపు నినాదాలు చేశారు. దీంతో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కల్పించుకుని గ్రూపులు కట్టడం పార్టీ సిద్ధాంతాలకు వ్యతిరేకమన్నారు. ఎవరైనా గ్రూపులు కడితే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేయడంతో సమస్య సద్దుమణిగింది. తొలుత టీడీపీ చేపట్టిన బస్సు యాత్ర యలమంచిలి మండలం ఏటికొప్పాక నుంచి బయలు దేరింది. బయ్యవరంలో రచ్చబండ నిర్వహించి టీడీపీ హయాంలోనే రైతులకు మేలు జరిగిందని ఆ పార్టీ సీనియర్ నేతలు వెంకటరావు, చలపతిరావు, బండారు సత్యనారాయణ చెప్పుకున్నారు. యలమంచిలిలోని టిడ్కో ఇళ్లు, రాంబిల్లి మండలం మురకాడ వద్ద శిథిలమైన రెగ్యులేటర్లు పరిశీలించారు. పూడిమడక మత్స్యకారులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ చిరంజీవి, టీడీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి బుద్ద నాగజగదీశ్వరరావు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాల వల్లే టీడీపీ ఓటమి

- జనసేన నేత గెడ్డం బుజ్జి
- బండారు వ్యాఖ్యలపై ఆగ్రహం
- పాయకరావుపేటలో అనిత ఎలా గెలుస్తారో చూస్తాం



**నక్కపల్లి:** తెలుగుదేశం పార్టీ రెండు సార్లు ఓటమి చెందడానికి చిరంజీవి, పవన్‌కల్యాణ్‌లే కారణమంటూ బస్సు యాత్రలో టీడీపీ నేత, మాజీమంత్రి బండారు సత్యనారాయణ మూర్తి వ్యాఖ్యానించడం పట్ల జనసేన పార్టీ సీనియర్ నాయకుడు, కాపునేత గెడ్డం బుజ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గుంటపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలు, స్వయంకృతాపరాధాలే టీడీపీ ఓటమికి కారణమన్నారు. 2009లో చిరంజీవి వల్ల, 2019లో పవన్‌కల్యాణ్ కల్యాణ్ వల్ల పాయకరావుపేటలో టీడీపీ ఓడిపోయిందని బండారు చెప్పడాన్ని ఆయన తప్పుపట్టారు. 2014లో జనసేన పార్టీ మద్దతు వల్లే పాయకరావుపేట నియోజకవర్గంలో వంగల పూడి అనిత ఎమ్మెల్యేగా గెలుపొందారన్నారు. గెలిచిన నెలరోజులకే జనసేన నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారని విమర్శించారు. తనపై కేసులు పెట్టారన్నారు. 2014లో జనసేన మద్దతు ఇవ్వకపోతే పాయకరావుపేటలో టీడీపీ అభ్యర్థి అనిత ఘోరంగా ఓటమి పాలయ్యేవారన్నారు. 2024 ఎన్నికల్లో పాయకరావుపేట నుంచి మళ్లీ గెలుపొందాలని వంగలపూడి అనిత ప్రయత్నిస్తున్నారని, ఆమె పాయకరావుపేటలో ఎలా గెలుస్తారో తాము చూస్తామన్నారు. ఆమె ఓటమే మా ధ్యేయమని చెప్పారు.అనితకు టికెట్ ఇస్తే పాయకరావుపేటలో ఓడిపోవడం ఖాయమని ఈ విషయాన్ని బండారుతోపాటు, టీడీపీ పెద్దలు గ్రహించాలన్నారు.

# రైలుకిందపడి వ్యక్తి ఆత్మ హత్య



మృతుడు నాగేశ్వరరావు(ఫైల్)

**నక్కపల్లి:** ఆర్థిక ఇబ్బందుల కారణంగా నక్కపల్లికి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తుని రైల్వే ఎస్‌ఐ షేక్ అబ్దుల్‌మారూఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లికి చెందిన మునసల నాగేశ్వరరావు(40) శుక్రవారం నర్సీపట్నం-గుల్లిపాడు రైల్వే స్టేషన్ల మధ్య రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముందుగా మృతుని వివరాలు తెలియరాలేదని, రైల్వేట్రాక్‌కు సమీపంలో మోటారు సైకిల్ ఉండడంతో దాని ఆధారంగా దర్యాప్తు జరపగా నక్కపల్లి కొత్తపేటకు చెందిన ఎం.నాగేశ్వరరావుగా తెలిసిందన్నారు.ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

## క్లుప్తంగా

### నారసింహునిగా జగన్నాథుడు



నారసింహుని అలంకరణలో జగన్నాథుడిని దర్శించుకుంటున్న భక్తులు

**కశింకోట :** కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి శుక్రవారం నరసింహావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథస్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామిని విష్ణుమూర్తి దశావతారాల్లో నాల్గవదైన నరసింహస్వామి అవతారంలో అలంకరించారు. విష్ణు సహస్రనామార్చన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి తదితరులు పూజా కార్యక్రమాలను జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

### విద్యార్థులందరికీ జేవీకే కిట్లు

**కశింకోట :** జగనన్న విద్యా కానుక(జేవీకే) కిట్లను శత శాతం విద్యార్థులకు పంపిణీ చేయాలని ఎంఈవో కె.చిట్టిబాబు కోరారు. కశింకోటలో మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. విద్యార్థులకు రాగి జావ, చెక్కీలను తప్పనిసరిగా అందించాలన్నారు. ప్రణాళికాబద్ధంగా పాఠ్యాంశాల బోధన సాగించాలని సూచించారు. మరో ఎంఈవో మూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలన్నారు. జేవీకే కిట్లు అందలేదన్న ఫిర్యాదు రాకుండా విద్యార్థులందరికీ అందించాలన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంఈవో-2 మూర్తిని ఉపాధ్యాయులు అభినందించారు.

### మండల సర్వసభ్య సమావేశం నేడు

**కశింకోట :** మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వి.వి.రవికుమార్ శుక్రవారం తెలిపారు. ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన జరిగే సమావేశానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వివిధ అంశాలపై చర్చించి పరిష్కారానికి చర్యలు చేపడతారన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

### బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శుక్రవారం 64 బెల్లం దిమ్మలు వచ్చాయి.

| దిమ్మల రకం | కనిష్ట ధర | గరిష్ట ధర |
|---|---|---|
| మొదటి రకం | --- | --- |
| రెండో రకం | 4,000 | 4,300 |
| మూడోరకం | 3,610 | 3,610 |

### అనకాపల్లి సినిమాలు

| | |
|---|---|
| మనుచరిత్ర | : రాజా |
| టక్కర్ | : సత్యనారాయణ స్క్రీన్-1 |
| మేమ్ ఫేమస్ | : సత్యనారాయణ స్క్రీన్-2 |
| 1920 | : షిర్డిసాయి |
| అశ్వనీస్ | : పర్తిసాయి |
| భీమదేవరపల్లి బ్రాంచ్(3 ఆటలు) | |
| ది ఫ్లాష్ (మ్యాట్నీ) | : వెంకటేశ్వర |
| యూనివర్సిటీ | : శ్రీసత్య |
| ఆదిపురుష్ | : రామచంద్ర |

### రక్త నిల్వలు

**అనకాపల్లిటౌన్ :** జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ నెగిటివ్-5 యూనిట్, బీ పాజిటివ్-14 యూనిట్లు, బీ నెగిటివ్-2యూనిట్లు, ఓ పాజిటివ్-21 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ ప్రతినిధి గంగయ్య(9182834480)ని సంప్రదించవచ్చు.

### గ్యాస్ సమాచారం

**అనకాపల్లిటౌన్ :** ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 436 మంది వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 349 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.



# నేరేడు పండు.. పోషకాలు మెండు

'అబ్బో నేరేడు పళ్లు.. అబ్బాయి కళ్లు' అన్నా.. 'అల్లో నేరేడు కళ్లదానా'.. అంటూ హీరోహీరోయిన్ల కళ్లను వర్ణించేందుకు సినీ రచయితలకు నేరేడు పండ్లను మించిన ఉపమానం మరొకటి లేదు. అయితే ప్రకృతి సిద్ధంగా లభించే ఈ సీజనల్ ఫ్రూట్ పోషకాల గని. తీపి, వగరు మిళితమైన ప్రత్యేక రుచితో నిగనిగలాడుతూ చవులూరిస్తుంది. ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్లో తోపుడు బండ్లపై ఎక్కడ చూసినా కనిపిస్తూ కొనుగోలుదారుల్ని ఇట్టే ఆకర్షిస్తున్నాయి.



పట్టణంలో ప్రధాన రహదారిలో బండిపై నేరేడు విక్రయాలు

- వేసవి సీజన్‌లో మాత్రమే లభించే ఫలం
- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు దిగుమతి
- మార్కెట్లో కిలో రూ.200 పైమాటే

**అనకాపల్లి రూరల్ :** ఆరోగ్య ప్రదాయిని నేరేడు పండు వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. ఈ సీజన్‌లో అంటే జ్యేష్ఠం నుంచి శ్రావణ మాసం వరకూ లభించే నేరేడు పండ్లు ప్రస్తుతం అనకాపల్లి మార్కెట్లో జోరుగా అమ్ముడుపోతున్నాయి. పక్కనున్న ఉభయగోదావరి జిల్లాలతో పాటు పొరుగునున్న మహారాష్ట్ర నుంచి నేరేడు పండ్లను వ్యాపారులు జిల్లా కేంద్రానికి దిగుమతి చేసుకుని రీటైల్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు కిలో పండ్లను రూ.80 నుంచి రూ.100కి రిటైల్ వ్యాపారులకు అమ్ముతున్నారు. రీటైల్ వ్యాపారులు కిలో రూ.150 నుంచి రూ.250 వరకు కొనుగోలుదారులకు విక్రయిస్తున్నారు. పట్టణంలో ఇపుడు ఎక్కడ చూసినా తోపుడు బండ్లపై ఈ పండ్లు విరివిగా కనిపిస్తున్నాయి.

**రుచిలో, పోషకాల్లో మేటి**

ప్రకృతి సిద్ధంగా లభించే నేరేడు రుచిలో మేటి. నోట్లో వేసుకోగానే ఇట్టే కరిగిపోయే ఈ పండు పోషకాల గని. సక్రమంగా వినియోగించుకుంటే ఈ పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అనేక అనారోగ్య సమస్యలను దూరం చేస్తాయి. పండు మాత్రమే కాదు ఆకులు, చెట్టు బెరడు కూడా శరీరానికి మేలు చేస్తాయి. నేరేడు పండ్లతో ఆరోగ్య పానీయాలు, జామ్‌లు, ఐస్‌క్రీమ్‌లు కూడా తయారు చేస్తుంటారు. నేరేడు కాయలను వెనిగర్, మద్యం తయారీలో ఉపయోగిస్తారు. ఆయుర్వేదం ప్రకారం నేరేడు పండు ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంది. వేసవిలో రోజుకు ఒక్క నేరేడు పండు తింటే వ్యాధులకు, అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**ప్రయోజనాలెన్నో...**

నేరేడు పండ్లలో ఐరన్, కాల్షియం, మెగ్నీషియం, పొటాషియంతో పాటు విటమిన్-బీ, సీ పుష్కలంగా ఉంటాయి. దీనివలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. ఎంతో కాలంగా కడుపులో పేరుకుపోయిన మలినాలు బయటకు పోవడానికి, పేగుల్లో చుట్టుకుపోయిన వెంట్రుకలను కరిగించడానికి నేరేడు పండు దోహదపడుతుంది. మూత్ర సమస్యల నియంత్రణతోపాటు మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. కిడ్నీలను శుభ్రపరుస్తుంది. మూత్రాశయంలో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. కాలేయ పనితీరును మెరుగుపర్చడంతో పాటు శుభ్రపరుస్తుంది. నేరేడు పండులోని యాంటీ ఆక్సిడెంట్లు గుండెకు, మెదడుకు దివ్యౌషధంగా పని చేస్తాయి. దంతాలు, చిగుళ్ల ఆరోగ్యకరంగా ఉంటాయి.

**మితిమీరి తినొద్దు**

నేరేడు పండ్లు మితిమీరి తింటే దుష్ఫలితాలు ఎదురవుతాయి. వగరు రుచి కలిగిన నాణ్యత లేని పండ్లు తింటే గొంతు నొప్పి రావచ్చు. సీజన్ మారే సమయంలో వీటిని మితంగానే తినాలి. ఉబ్బసం బాధితులు ఈ పండ్లను అధికంగా తినరాదు. అతిగా తింటే దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నేరేడు పండ్లలో అధిక లవణాలు, పోషకాలు ఉండటం వలన బలహీనమైన జీర్ణ వ్యవస్థ కలిగిన వారికి కడుపునొప్పి వచ్చే అవకాశం ఉంది.

**త్వరగా అమ్ముడుపోతున్నాయి**



తాజా నేరేడు పండ్లు త్వరగా అమ్ముడుపోతున్నాయి. నెల రోజులు క్రితం ప్రారంభమైన సీజన్ మరో మూడు వారాల్లో ముగుస్తుంది. మహారాష్ట్ర నుంచి వీటిని దిగుమతి చేసుకుంటున్నాం. రుచి కూడా బాగుంది. రోజుకు 100 కిలోల వరకూ విక్రయిస్తున్నా. ఏటా ఈ సీజన్లో నేరేడు పండ్ల విక్రయాలు చేపడుతూ ఉపాధి పొందుతున్నాను.

– సిరిగిశెట్టి మోహన్, వ్యాపారి, అనకాపల్లి

**పోషకాలు అధికం**



నేరేడు పండ్లలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. 100 గ్రాముల నేరేడు పండ్లలో నీరు 83 గ్రాములు, శక్తి 60 కిలో కేలరీలు, ప్రొటీన్లు 0.72 గ్రాములు, కొవ్వులు 0.23 గ్రాములు, కార్బోహైడ్రేట్లు 15.56 గ్రాములు, విటమిన్లు బీ1, బీ2, బీ3, బీ6, సీ లతో పాటు మినరల్స్ కూడా ఉంటాయి. వీటిని తగు మోతాదులో తీసుకుంటే ఆరోగ్యానికి మేలు.

– ఎస్.వాణీజగదీశ్వరి, వైద్యురాలు, పీహెచ్‌సీ, తుమ్మపాల

# సంక్షేమ దీక్ష.. జగనన్న సురక్ష



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు



హాజరైన ప్రజాప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు

- ఎంపీపీ సూరిబాబు
- తుమ్మపాలలో కన్వీనర్లతో సమావేశం

**అనకాపల్లి రూరల్ :** అర్హులందరికీ పథకాలు అందించడం, ప్రజా సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యమని అనకాపల్లి ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. శుక్రవారం తుమ్మపాల వైఎస్సార్ కళ్యాణ మండపంలో జగనన్న సురక్ష ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఊరిలో, కాలనీలో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందని అర్హులెవరైనా మిగిలి ఉంటే, వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేయాలని కోరారు. పార్టీ క్యాడర్ అందర్నీ సమన్వయ పరచుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దలీప్‌కుమార్, పార్టీ ముఖ్యనేత భీశెట్టి జగన్ మాట్లాడుతూ కుల, మత, ప్రాంత, రాజకీయాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం, సదుద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సాంకేతిక, ఇతరత్రా కారణాలతో ధ్రువపత్రాలు పొందలేని వారికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, వడ్డాది అశోక్, పసీరు వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ చదరం చిన్నా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు విత్తనాల పంపిణీ



రైతులకు వరి విత్తనాలు అందిస్తున్న దాడి రత్నాకర్

**అనకాపల్లిటౌన్ :** ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయడంతో పంట దిగుబడులు బాగుంటున్నాయని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. గవరపాలెం కర్రివారి వీధిలో శుక్రవారం రైతులకు వరి విత్తనాల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రైతులకు ఆర్‌జీఎల్ రకం వరి విత్తనాలను ఏటా ఆర్‌ఏఆర్‌ఎస్ నుంచి తీసుకొచ్చి అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి, రైతులు కర్రి మోదునాయుడు, పొలిమేర ఆదిబాబు, కర్రి కృష్ణ, సన్యాస అప్పారావు, బలరాం, అచ్చయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షపై సీఎం ప్రసంగం లైవ్ ప్రదర్శన

**కశింకోట :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై టీవీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లైవ్ ప్రసంగాన్ని శుక్రవారం ప్రదర్శించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని అర్హులను గుర్తించి, సమస్యల్ని పరిష్కరించి, వారిని కూడా లబ్ధిదారుల జాబితాలో చేర్చాల్సిందిగా అధికారులు, సచివాలయ సిబ్బందిని సీఎం ఆదేశించారు. సంక్షేమ పథకాల అములులో సమస్యల్ని పరిష్కరించేందుకు నెల రోజుల పాటు నిర్వహించనున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి, విజయవంతం చేయాలని సూచించారు.

ఈ లైవ్ ప్రసారాన్ని ఎంపీపీ కలగా లక్ష్మి, వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఏవో ఎ.ఎ.ఖాన్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు తదితరులు వీక్షించారు.



ఎంపీడీవో కార్యాలయంలో లైవ్ ప్రసారాన్ని తిలకిస్తున్న అధికారులు, నేతలు

## మోదీ పాలనలో దేశం పురోభివృద్ధి



కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేస్తున్న నర్సింగ్‌యాదవ్

**అనకాపల్లిటౌన్ :** మోదీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం ఎంతగానో పురోభివృద్ధి సాధించిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీకి మరోసారి అవకాశం కల్పించాలని బీజేపీ మండల అధ్యక్షుడు వి.నర్సింగ్ యాదవ్ అన్నారు. స్థానిక గాంధీనగరంలో పార్టీ పిలుపు మేరకు గృహ సంపర్క్ అభియాన్(ఇంటింటా బీజేపీ) కార్యక్రమం శుక్రవారం నిర్వహించి, కేంద్రప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం దేశంలో కొత్తగా 17 విమానాశ్రయాలను నిర్మించిందన్నారు. ప్రధాన రహదారులను అనుసంధానిస్తూ 6లైన్ హైవేను అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఉడా రమేష్, నేతలు ఓరుగంటి నాగమణి, కె.శ్రీనివాసరావు, ఎ.కామేశ్వరరావు, కర్రి రామకృష్ణ, లెక్కల నాయుడు, జి.శేషు తదితరులు పాల్గొన్నారు.

## దశలవారీగా గ్రామాల్లో డ్రైనేజీల అభివృద్ధి

**అనకాపల్లిటౌన్ :** ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దశల వారీగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రధాన కాలువ(డ్రైనేజీ)లను నిర్మించి వాటికి పిల్లకాలువలను అనుసంధానం చేయనున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. మండలంలోని గొలగాం పంచాయతీ పరిధి ఎల్లారమ్మ ఎస్సీకాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.12 లక్షలతో డ్రైనేజీ నిర్మాణపనులు చేపట్టడం జరుగుతుందన్నారు. నాణ్యతా లోపాల్లేకుండా కాంట్రాక్టర్లు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు. రానున్న వర్షాకాలంలో దోమల సమస్యల్లేకుండా కాలువల నిర్మాణ పనులు చేపడుతున్నామన్నారు. కొన్ని గ్రామాల్లో మురుగునీరు రహదారులపై ప్రవహిస్తోందని, దాన్ని నియంత్రించేందుకు గ్రామ సర్పంచ్‌లు, సచివాలయం ఉద్యోగులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గొలగాం సర్పంచ్ ఎస్.నాగ నరసింగరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి కశిరెడ్డి కనకబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శివకుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు పసుపులేటి రామకృష్ణ, వలంటీర్లు, ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

## రాయితీ వరి విత్తనాల అందజేత

**పరవాడ:** వరి విత్తన శుద్ధి కోసం రైతులు సూడో మోనస్ ఫ్లోరిసెన్స్ లిక్విడ్ ఉపయోగించాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి సూచించారు. కలపాక రైతు భరోసా కేంద్రంలో ఆమె రైతులకు వరి విత్తనాల పంపిణీ చేశారు. స్వయంభూవరంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న 50 ఎకరాల వరి పంటకు అయ్యే వ్యయాన్ని రీ సస్టైనబిలిటీ కంపెనీ భరిస్తుందన్నారు. కార్యక్రమంలో కలపాక సర్పంచ్ బొండా కనకారావు, సీఎస్సార్ హెడ్ మహేంద్ర, కె.శ్రీకాంత్( రాంకీ ఫౌండేషన్) పాల్గొన్నారు.



విత్తనాలు అందిస్తున్న ఏవో చంద్రావతి

## వేద విద్యకు ప్రత్యేక గుర్తింపు అవసరం



మాట్లాడుతున్న జీవీఎల్ నరసింహారావు

**సబ్బవరం:** ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వేద విద్యకు ప్రత్యేక గుర్తింపు అవసరమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అన్నారు. సబ్బవరం మండలం గొల్లలపాలెంలోని సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం వేద దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు దేవాలయాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం లేదన్నారు. వేద విద్యకు సరైన ప్రోత్సాహం అందించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరైన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. వేద అధ్యయనానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం సహాయ సహకారాలపై చర్చిస్తానని వెల్లడించారు. సభకు అధ్యక్షత వహించిన సప్త రుషి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు మాధవ శర్మ మాట్లాడుతూ కనీస ప్రోత్సాహం లేకపోవడంతో భవిష్యత్తులో వేద విద్య కనుమరుగయ్యే అవకాశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలువురు వేద పండితులను సత్కరించారు.

# పేదలకు రక్ష.. జగనన్న సురక్ష



మారేడుపూడి గ్రామంలో పర్యటిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహిళకు సంక్షేమ ప్రతులను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- ప్రతి ఒక్కరికీ సంక్షేమం, అభివృద్ధి.. అదే మా లక్ష్యం
- 'గడప గడపకు మనప్రభుత్వం'లో మంత్రి అమర్‌నాథ్

**అనకాపల్లిటౌన్ :** రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, శతశాతం అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగపడుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని మారేడుపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని కుటుంబాల వారీ గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి అధికారి చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. అర్హత ఉండి పథకాలు అందని వారంటూ ఉండకూడదని పేర్కొన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని అధికారులు సవాల్‌గా తీసుకొని పని చేయాలని ఆదేశించారు. టీడీపీ నేతలు ప్రజలను నమ్మించి మోసం చేశారని, జగనన్న ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, దీనికి నిదర్శనమే నవరత్నాల అమలు అని స్పష్టం చేశారు. స్వతంత్ర భారతావనిలో ఏ ప్రభుత్వమైనా ఇన్ని పథకాలను ప్రజలకు అందించిందా? అని ప్రజలకు అడిగి, వారి స్పందన తెలుసుకున్నారు. ప్రతిపక్ష నేత హోదాలో ప్రజాసంకల్పయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కష్టాలను నేరుగా చూసి ఇన్ని పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇంతగా మంచి చేస్తున్న, మరింతగా మంచి చేయాలని తపిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలన్నా, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్నా జగనన్న పాలన మళ్లీ రావాలని కోరారు. సాంకేతిక కారణాలతో ఇళ్లపట్టాలు, సంక్షేమ పథకాలు అందనివారి వివరాలు తీసుకుని, వాటి సత్వర పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మంత్రి వెంట ఎంపీపీ గొర్లి సూరిబాబు, గ్రామ సర్పంచ్ సాలాపు కనకరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ

**కశింకోట :** భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో కశింకోటలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్ర పటానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పూలమాల వేసి, నివాళులర్పించారు. దేశానికి ముఖర్జీ అందించిన సేవలను ప్రస్తుతించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.ఎం.నాయుడు, పార్టీ నాయకులు శిష్టి అప్పారావు, గొన్నాబత్తుల అమృతరావు, నడిపల్లి చినఅబ్బాయి, కొల్లి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

- తాళ్లపాలెంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు కరక సత్యనారాయణ, మండల సోషల్ మీడియా కన్వీనర్ పంచాడ గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



కశింకోటలో శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

## ఎంటీఎస్ అమలు కోసం నిరసన

**అనకాపల్లిటౌన్ :** వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేలు(ఎంటీఎస్) అమలుచేయాలని నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల అసోసియేషన్ పట్టణశాఖ ప్రతినిధి ఎ.సతీష్‌కన్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక గొల్లవీధి యూపీహెచ్‌సీ వద్ద కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నల్లబ్యాడ్జిలతో శుక్రవారం నిరసనకు దిగారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వచ్చే నెల 10 వరకు వివిధ రూపాల్లో నిరసన తెలపనున్నట్టు పేర్కొన్నారు. ఆగష్టు 1 నుంచి విధులు బహిష్కరించి, నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు హెచ్చరించారు. ఢిల్లీ, పంజాబ్, అస్సాం, హర్యానా, ఒడిశా రాష్ట్రాల మాదిరిగా తమను రెగ్యులర్ చేయాలని, జేఏసీ ప్రతినిధులతో చర్చించి ఇచ్చిన జీవో నం.60 ప్రకారం వేతనాలు, బకాయిల్ని వెంటనే చెల్లించాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఒకే కేడర్- ఒకే జీతం, పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు బి.శ్రీనివాస్, సీహెచ్ వెంకటరత్నం, పి.సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## ఖరీఫ్ వరి విత్తనాల పంపిణీకి సన్నద్ధం

- మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా నేడు ప్రారంభం





కశింకోటలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన వరి విత్తనాలు (ఇన్‌సెట్) వ్యవసాయ అధికారి స్వప్న

**కశింకోట :** మండల రైతాంగం ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ సాగుకు వీలుగా నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసినట్టు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. కశింకోట ప్రధాన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే)లో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 19 ఆర్బీకేల్లో ఆయా ప్రాంత రైతులకు 620 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో ఈ ప్రాంతంలో ఎక్కువగా పండించే ఆర్‌జీఎల్ రకం 550 క్వింటాళ్లు, సాంబమసూరి 51 క్వింటాళ్లు, సోనామసూరీ, ఎంటీయు-1318 రకం నూతన విత్తనాలను కూడా అందుబాటులో ఉంచామన్నారు. వీటిలో ఎంటీయూ రకం విత్తనాలను కశింకోట, వెదురుపర్తి, నూతలగుంటపాలెం, జెట్టపురెడ్డితుని తదితర ప్రాంతాల్లో సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. ఇది ఆర్‌జీఎల్ రకానికి ప్రత్యామ్నాయమన్నారు. దిగుబడి, నాణ్యత ఆశాజనకంగా ఉంటుందని పేర్కొన్నారు. దీన్ని గత ఏడాది శాంపిల్ సీడ్‌గా రైతులు పండించిన విషయాన్ని గుర్తుచేశారు. దిగుబడి బాగానే వచ్చిందన్నారు. కశింకోటలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో శనివారం వరి విత్తనాల పంపిణీని ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. సాంబ మసూరీ విత్తనాలు 25 కిలోలు, మిగిలినవి 30 కిలోల పరిమాణంలో పంపిణీకి సిద్ధం చేశామన్నారు. రైతులు విత్తనాల కొనుగోలుకు ముందుగానే చెల్లింపులు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే 80 శాతం వరకు పూర్తైనట్టు తెలిపారు. ఈ ఏడాది మండలంలో వరి సాధారణ విస్తీర్ణం 892 హెక్టార్లుగా ఉంటుందన్నారు.

## 25న వాడచీపురుపల్లిలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం

**పరవాడ:** మండలంలోని వాడచీపురుపల్లిలో ప్రముఖ వైద్యుడు, దివంగత కేవీ రామన్ జ్ఞాపకార్థం ఈ నెల 25న ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ నవ్య ఒక ప్రకటనలో తెలిపారు. వాడచీపురుపల్లి పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరంలో పాల్గొని వైద్య సేవలు పొందాలని డాక్టర్ నవ్య ఈ సందర్భంగా కోరారు.